సాక్షి
కామారెడ్డి
సోమవారం । 28 । ఆగస్టు । 2023



బీఆర్ఎస్‌కు ఓటెయ్యం
ముదిరాజ్‌లకు ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వకపోతే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేయబోమని ముదిరాజ్ సంఘ సభ్యులు పేర్కొన్నారు.
- 9లో ▸



ఘనంగా తీజ్
పలు తండాలలో ఆదివారం తీజ్‌ను ఘనంగా జరుపుకున్నారు. సేవాలాల్ మహరాజ్, జగదాంబ మాతలకు పూజలు చేశారు.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
35.3 /21.4

వాతావరణం
ఉదయం ప్రకాశవంతంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

రాఖీ పండుగకు ప్రత్యేక బస్సులు



కామారెడ్డి టౌన్: రాఖీ పండుగను పురస్కరించుకుని జిల్లాలో ఈనెల 29, 30, 31, సెప్టెంబర్ 1 తేదీలలో ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ కామారెడ్డి డిపో మేనేజర్ ఇందిర తెలిపారు. పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక చాలెంజ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రత్యేక బస్సులతో మరింత ఆదాయం తీసుకువస్తామని ఉద్యోగులు డిపో ఆవరణలో చాలెంజ్ చేశారని తెలిపారు.

విఠలేశ్వర స్వామి ఆలయానికి పాదయాత్ర



పిట్లం(జుక్కల్): బైరాపూర్‌లోని విఠలేశ్వర స్వామి దర్శనానికి గౌరారం గ్రామం నుంచి భక్తులు ఆదివారం పాదయాత్రగా తరలారు. గ్రామానికి చెందిన 50 మంది భక్తులు భజనలు చేస్తూ వెళ్లారు. స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేసి తిరిగి గౌరారానికి చేరుకుంటామని వారు తెలిపారు.

'మొక్కలను సంరక్షించాలి'



కామారెడ్డి క్రైం: పర్యావరణ పరిరక్షణకోసం మొక్కలు నాటి, సంరక్షించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ఆదివారం కామారెడ్డిలోని వివిధ నర్సరీలు, రాశివనంలో పెంచుతున్న మొక్కలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రహదారుల వెంట గ్యాప్ లను గుర్తించి 4 అడుగుల పొడవున్న మొక్కలను కర్ర ఊతంతో నాటాలని సూచించారు. మిగతా మొక్కలను వార్డులలో పాఠశాలలు, ఇతర ప్రాంతాల్లో నాటేలా చూడాలన్నారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి, మునిసిపల్ కమీషనర్ దేవేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిరావాలి

కామారెడ్డి రూరల్: ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్‌చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద మహాధర్నా చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జేఏసీ కన్వీనర్ సత్యనారాయణ తెలిపారు. మహా ధర్నాకు తరలిరావాలని సమగ్ర శిక్ష ఉద్యోగులను కోరారు.

జెండాకు ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని జెండా బాలాజీ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. జెండా జాతరలో ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బాలాజీ జెండాను అంకాపూర్ గ్రామస్తులకు అప్పగించే కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై నిర్మిస్తున్న నవనాథ సిద్ధేశ్వర పిరమిడ్ ధ్యాన మందిరం నిర్మాణ పనులను పరిశీలించారు. జెండా బాలాజీ ఆలయంలో సర్వసమాజ్ అధ్యక్షుడు ఆకుల రాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లను ఘనంగా నిర్వహించారు.

ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్

ఇందల్వాయి: ఇందల్వాయి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి సోమవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలు, టీసీతో ఉదయం పదిన్నర గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కళాశాలకు రావాలని, వివరాలకు 83339 25399 నంబరులో సంప్రదించాలని సూచించారు.



ఐసీడీఎస్ వారి పెళ్లిపిలుపు

- బాలికను అక్కున చేర్చుకుని విద్యాబుద్ధులు నేర్పిన బాలసదనం
- నర్సింగ్ కోర్సుతో బతుకుబాట
- పెళ్లి పెద్దలుగా మారిన జిల్లా అధికారులు

సాక్షి, కామారెడ్డి: ఊహ తెలియని వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయిన ఆ బాలికను మహిళా శిశు సంక్షేమ శాఖ అక్కున చేర్చుకుంది. కామారెడ్డిలోని బాలసదనంలో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పించింది. ఆమెకు యుక్త వయసు రావడంతో అన్నీ పరిశీలించి, సంబంధం కుదిర్చారు. జిల్లా అధికారులే పెళ్లి పెద్దలుగా మారి పెళ్లిపీటలు ఎక్కించబోతున్నారు. ఈ సన్నివేశం సోమవారం సదాశివనగర్ మండలంలోని ధర్మరావుపేటలో ఆవిష్కృతం కాబోతోంది.

జత కలిసిందిలా..

చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయిన రూప, ఆమె చెల్లెలిని ఐసీడీఎస్ అధికారులు బాలసదనంలో చేర్పించారు. రూప పదో తరగతి పూర్తి చేశాక మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ కోర్సు చదివించారు. ఇటీవలే కోర్సు పూర్తయ్యింది. రూప చెల్లెలు ప్రస్తుతం పాలిటెక్నిక్ కోర్సు చదువుతోంది.

ఇదే సమయంలో ధర్మారావుపేట గ్రామానికి చెందిన అనిల్ బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లి వచ్చారు. ఆయనకు కుటుంబ సభ్యులు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఈ క్రమంలో బాలసదనంలో పెరుగుతున్న రూప గురించి ఎవరో చెప్పడంతో అధికారులతో మాట్లాడాడు. రూప, అనిల్ ఇరువురూ పరస్పరం ఇష్టపడడంతో అధికారులు పెళ్లి చేయడానికి నిర్ణయించారు. వరుడి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాక.. డాక్యుమెంటేషన్ ప్రక్రియనంతా పూర్తి చేశారు.

నేడు వివాహం..

రూప, అనిల్‌ల వివాహం సోమవారం జరగనుంది. సదాశివనగర్ మండలంలోని ధర్మరావుపేటలోగల రెడ్డి సంఘ భవనం దీనికి వేదిక అవుతోంది. రూప పెళ్లికి జిల్లా స్థాయి అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు అండగా నిలుస్తున్నారు. వివాహ ఖర్చును పెళ్లి కొడుకే భరిస్తుండగా.. కావలసిన సామగ్రి, బంగారం, దుస్తులను అధికారులు సమకూరుస్తున్నారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డితో పాటు స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ తదితరులు హాజరవుతారని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు.

ఆహ్వానించేది అధికారులే..

రూప, అనిల్‌ల వివాహం కోసం 'మహిళా శిశు సంక్షేమ శాఖ' పేరుతో ఆహ్వాన పత్రిక ముద్రించారు. పత్రికలో పెళ్లి కూతురు, పెళ్లి కుమారుడి పేర్లు, వివరాలు, వివాహం జరుగు స్థలం పొందుపరిచారు. అధికారులే పెళ్లి పెద్దలుగా మారారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా సంక్షేమ అధికారి పి.రమ్య, డీసీపీవో జె.స్రవంతి, బాలసదనం సూపరింటెండెంట్ కే.సంగమేశ్వరి వివాహానికి అందరినీ ఆహ్వానిస్తున్నారు.



రాష్ట్రంలో ప్రత్యామ్నాయం బీజేపీనే



మాట్లాడుతున్న అక్కల్‌కోట్ ఎమ్మెల్యే సచిన్ కల్యాణ్ శెట్టి

- పశ్చిమబెంగాల్‌లో వలె ఇక్కడా సీఎంకు ఓటమి ఖాయం
- అక్కల్‌కోట్ ఎమ్మెల్యే సచిన్ కల్యాణ్ శెట్టి

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనేనని ఆ పార్టీ అక్కల్‌కోట్ ఎమ్మెల్యే సచిన్ కల్యాణ్ శెట్టి పేర్కొన్నారు. అవినీతిమయమైన బీఆర్ఎస్ ఓడిపోవడం ఖాయమన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీలో గెలిచిన వారు అమ్ముడుపోతారని, వారిని కేసీఆర్ మళ్లీ కొనుగోలు చేస్తాడని పేర్కొన్నారు. గజ్వేల్‌లో ఓడిపోతానన్న భయంతోనే సీఎం కామారెడ్డిలో పోటీ చేస్తున్నారన్నారు. పశ్చిమ బెంగాల్‌లో సీఎం మమతాబెనర్జీని ఓడించినట్లు కామారెడ్డిలోనూ సీఎంను బీజేపీ ఓడిస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. తొమ్మిదేళ్లలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అనేక నిధులు ఇచ్చిందని, కానీ రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పులపాలు చేశారని పేర్కొన్నారు. తాను నియోజకవర్గంలో 10 రోజులుగా పర్యటిస్తున్నానని, ప్రజలనుంచి సమస్యలు కుప్పలుగా వస్తున్నాయని పేర్కొన్నారు. దోమకొండకు డిగ్రీ కళాశాల మంజూరు చేయడంలో సీఎం విఫలమయ్యారన్నారు. కేసీఆర్‌ను గెలిపిస్తే కామారెడ్డి డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేసి భూములు కబ్జా చేయడం ఖాయమన్నారు. తెలంగాణలో కేసీఆర్ కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని ప్రజలను కోరారు. లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై విలేకరులు ప్రశ్నించగా దర్యాప్తు జరుగుతోందని. త్వరలో అరెస్టవవచ్చని పేర్కొన్నారు. ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇస్తే డబుల్ ఇంజన్ తరహాలో తెలంగాణను అభివృద్ధి చేస్తామన్నారు. సమావేశంలో బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీకాంత్, కౌన్సిలర్లు పండ్ల ప్రవీణ్, నరేందర్, నాయకులు కుంట లక్ష్మారెడ్డి, తేలు శ్రీనివాస్, విపుల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత భిక్కనూరు పర్యటన వాయిదా

సాక్షి, కామారెడ్డి/భిక్కనూరు: భిక్కనూరు మండల కేంద్రంలో ఎమ్మెల్సీ కవిత పర్యటన వాయిదా పడింది. ఈ విషయమై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, ఆత్మ కమిటీ భిక్కనూరు చైర్మన్ నర్సింహారెడ్డి ఆదివారం వేరువేరు ప్రకటనలు విడుదల చేశారు. భిక్కనూరులో సోమవారం ఎమ్మెల్సీ పర్యటించాల్సి ఉందని, అనివార్య కారణాలతో పర్యటన వాయిదా పడిందని పేర్కొన్నారు. త్వరలో జిల్లాకేంద్రంలో భారీ సభ నిర్వహిస్తామని ముజీబొద్దీన్ తెలిపారు.

కేసీఆర్‌కు ఓటమి తప్పదు



మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

- లిక్కర్‌రాణి కవిత వస్తుంది.. ప్రజలూ జాగ్రత్త
- మాజీ మంత్రి షబ్బీర్‌అలీ

దోమకొండ: సీఎం కేసీఆర్‌కు కామారెడ్డిలో ఓటమి తప్పదని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ పేర్కొన్నారు. దోమకొండలో ఆదివారం పార్టీ మండల కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం గోపాల్‌పల్లి, అంబారిపేట గ్రామాల్లో పార్టీ జెండా ఆవిష్కరించి కార్యకర్తల సమావేశాలలో మాట్లాడారు. కామారెడ్డి ప్రాంతంలో ఉన్న అసైన్డ్ భూములను కబ్జా చేయడానికే సీఎం కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కామారెడ్డి ప్రాంతంలో వేల ఎకరాల అసైన్డ్ భూమి ఉందన్నారు. ఇప్పటికే కేసీఆర్ కూతురు, లిక్కర్‌రాణి కవిత జంగంపల్లి ప్రాంతంలో 100 ఎకరాల భూమిని తక్కువ ధరకు కొన్నారని ఆరోపించారు. తన పుట్టిన ఊరు కోనాపూర్ అని చెబుతున్న సీఎం కేసీఆర్.. ఇన్నేళ్లు గ్రామానికి ఎందుకు సేవ చేయలేదని ప్రశ్నించారు. ముందుగా కేటీఆర్ కోనాపూర్ మా నానమ్మ ఊరు అని వచ్చారని, తర్వాత కవిత ఇక్కడ భూములను కొన్నారని, ఇప్పుడు కేసీఆర్ ఎమ్మెల్యేగా పోటీకి వస్తున్నారని పేర్కొన్నారు. చింతమడకలో ఇచ్చినట్లుగా ఎన్నికలకు ముందే కొనాపూర్ గ్రామంలో ఇంటింటికి రూ.12 లక్షల చొప్పున ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఇన్నేళ్లు అభివృద్ధి చేయలేదన్నారు. కామారెడ్డి ప్రాంతానికి నిధులివ్వని సీఎంకు ఇక్కడి ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. గద్దర్ కూడా కేసీఆర్‌ను గద్దె దించాలని పిలుపునిచ్చారన్నారు. ఆయన పిలుపుమేరకు సీఎంను ఓడించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేయబోయే కార్యక్రమాలను గురించి ప్రజలకు వివరించారు. అంతకుముందు ఆయన మండలకేంద్రంలోని చాముండేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు అనంతరెడ్డి, సుతారి రమేష్, భీంరెడ్డి, పండ్ల రాజు, అబ్రబోయిన స్వామి, సీతారం మధు, ఆశబోయిన శ్రీనివాస్, రమేష్, ప్రసాద్, నాగారపు లింగం, రాజేశ్వర్, ప్రభాకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, బాల్‌రాజ్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థం నుంచి అర్థం

- పనికి రాని బాటిళ్లతో పలు ఆకృతులు
- పంచాయతీ కార్యదర్శి ఆలోచన
- సర్పంచ్, గ్రామస్తుల ప్రోత్సాహం



ప్లాస్టిక్ బాటిళ్లతో తయారు చేసిన ప్లాస్టిక్ సేకరణ కుండీ



కరక్‌వాడి పంచాయతీ కార్యాలయం వద్ద ప్లాస్టిక్ బాటిళ్లతో తయారు చేసిన ఆకృతులు

సాక్షి, కామారెడ్డి: రోజూ ఇళ్లనుంచి చెత్తను సేకరించే క్రమంలో ఖాళీ వాటర్ బాటిళ్లు, కూల్ డ్రింక్ బాటిళ్లను వేరుచేసి ఒక్కచోట పోగుచేశారు. పనికిరాని బాటిళ్లను ప్రయోజకరంగా మలచి వినియోగించుకుంటున్నారు గాంధారి మండలంలోని కరక్‌వాడి గ్రామస్తులు. ఇళ్లల్లో వృథాగా పడి ఉండే ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించాలన్న అధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి సునీత గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లారు. ఇందుకు సర్పంచ్ వసంత, పాలకవర్గం సహకారం తీసుకున్నారు. పంచాయతీ సిబ్బందితో కలిసి ఒక రోజు వృథాగా ఉన్న వాటర్, కూల్ డ్రింక్ బాటిళ్లను సేకరించి పంచాయతీ వద్దకు తీసుకువచ్చారు. వీటితో వివిధ వస్తువులు రూపొందించారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఓ పక్కన ప్లాస్టిక్ బాటిళ్లన్నింటినీ ఒకదానిపై ఒకటి పేర్చుతూ కిందపడిపోకుండా ఉండేందుకు ఫెవికల్‌తో అతికించారు. దీంతో ఓ కుండీ తయారయ్యింది. గ్రామంలో ప్లాస్టిక్ వస్తువులన్నింటినీ తీసుకువచ్చి అందులో పడేసేలా కుండీని తయారు చేశారు. దానికి ప్లాస్టిక్ సేకరణ కుండి అన్న పేరు పెట్టారు. పంచాయతీ సిబ్బంది రోజూ చెత్త సేకరణలో భాగంగా ఇళ్లిళ్లూ తిరిగినపుడు అందులో వచ్చే ప్లాస్టిక్ వస్తువులు, బాటిళ్లను తీసుకువచ్చి ఆ కుండీలో వేస్తున్నారు. వచ్చిన ప్లాస్టిక్ వస్తువులతో ఏదో ఒకటి తయారు చేయడం అలవాటు చేసుకున్నారు.

మొక్కల కోసం..

ప్లాస్టిక్ బాటిళ్లను నేలపై వరుసగా పాతిపెట్టారు. వాటితో ఓ ఆకృతి తయారైంది. మూడు వరుసల్లో కుండీలాగా పాతి ఆ బాటిళ్లకు మూడు రంగులు వేశారు. ఆ కుండీల్లో రకరకాల మొక్కలు నాటారు. అంతేకాకుండా బాటిళ్ల దిగువ భాగాన్ని కత్తిరించి వేలాడదీసి అందులో మొక్కలు నాటుతున్నారు. సేకరించిన ప్లాస్టిక్ బాటిళ్ల మూతలతో కరక్‌వాడి అంటూ ఇంగ్లిష్ అక్షరాల రూపంలో పంచాయతీ కార్యాలయం గోడకు అతికించారు.

కలెక్టర్ సూచనలతో..



ప్లాస్టిక్ వస్తువులను సేకరించి, వాటిని వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. దీంతో మేం గ్రామంలో ప్లాస్టిక్ బాటిళ్లు, మూతలను సేకరించి, వివిధ ఆకృతులు తయారు చేశాం. ఇంకా రకరకాలవి చేస్తాం. బాటిళ్లలో పూలమొక్కలను పెంచుతాం.
– సునీత, పంచాయతీ కార్యదర్శి

వ్యర్థాలను సేకరిస్తున్నాం



ప్రతి ఇంటి నుంచి చెత్తతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్నాం. గ్రామస్తులు అందరూ సహకరిస్తున్నారు. ఇళ్లల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలను పంచాయతీకి ఇచ్చేస్తున్నారు. సేకరించిన ప్లాస్టిక్ బాటిళ్లతో పంచాయతీ కార్యాలయం వద్ద రకరకాల ఆకృతులు తయారు చేస్తున్నాం.
– వసంత, సర్పంచ్, కరక్‌వాడి

'దేవాదాయం'పై శ్వేతపత్రం ఇవ్వాలి

- క్యాసినో నిర్వాహకుడు చీకోటి ప్రవీణ్ డిమాండ్
- సిద్ధరామేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



చీకోటి ప్రవీణ్‌ను సన్మానిస్తున్న ఆలయ పునర్నిర్మాణ కమిటీ ప్రతినిధులు

భిక్కనూరు: రాష్ట్రంలోని దేవాలయాల ఆదాయ వివరాలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని క్యాసినో నిర్వాహకుడు చీకోటి ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలోని శ్రీసిద్ధరామేశ్వరాలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం దేవాలయాల నుంచి వచ్చే ఆదాయాన్ని తీసుకుని ఇతర కార్యక్రమాలకు వినియోగించే విధానాన్ని మానుకోవాలన్నారు. ఇతర మతాల ప్రార్థన స్థలాల నుంచి వచ్చే ఆదాయంలో ఒక్క పైసా తీసుకోని సర్కారు.. హిందూ ఆలయాలనుంచే వచ్చే ఆదాయాన్ని మాత్రం తీసుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. దేవాలయాల్లో హిందువులకే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముస్లింలకు హజ్ యాత్రకు ఆర్థిక సాయం చేస్తున్నట్లే ప్రభుత్వం హిందువులకు బద్రీనాథ్, కాశీ, చార్‌ధామ్, అమర్‌నాథ్ యాత్రలకూ ఆర్థిక సాయం అందించాలన్నారు. ఎన్నో ఏళ్లుగా తాను వ్యాపారం చేస్తున్నానని, అయితే మెదక్ జిల్లాలో దేవాలయాల అభివృద్ధి, హిందుత్వ అభ్యున్నతికి కృషి చేస్తున్నందునే ప్రభుత్వం కక్షగట్టి కేసులు పెట్టించిందని ఆరోపించారు. కేసులకు భయపడేది లేదని, హిందుత్వమే ఎజెండాగా ముందుకు వెళ్తానని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ తరఫున ఎల్బీనగర్ అసెంబ్లీ లేదా జహీరాబాద్ పార్లమెంట్ స్థానంనుంచి పోటీ చేయాలని యోచిస్తున్నానన్నారు. వందల ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీసిద్ధ రామేశ్వరాలయం అభివృద్ధికి ప్రభుత్వం నిధులను మంజూరు చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రతి ఒక్కరూ తాము సంపాదించిన దాంట్లో కొంతమొత్తాన్ని ఆలయాల అభివృద్ధికి వెచ్చించాలని కోరారు. ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీధర్, పూజారులు రామగిరిశర్మ, రాజేశ్వరశర్మ పాల్గొన్నారు.

మ్యాట్రిమోనీలో పరిచయమై..

- రూ. 12 లక్షలు దోచేసిన వివాహిత
- యువకుడి ఫిర్యాదుతో కేసు నమోదు

బోధన్‌రూరల్: మ్యాట్రిమోనీలో పరిచయమై.. పెళ్లి చేసుకుందామని నమ్మించి ఓ యువకుడిని నిండా ముంచిందో వివాహిత. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన వివరాలిలా ఉన్నాయి.

నిజామాబాద్ జిల్లా సాలూర మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఏడాది క్రితం మ్యాట్రిమోనీ సైట్‌లో తన వివరాలు నమోదు చేశాడు. ఏపీలోని వైజాగ్ ప్రాంతానికి చెందిన స్వాతి అనే వివాహిత గతేడాది అక్టోబర్‌లో సైట్‌నుంచి అతడి వివరాలను తీసుకుని పరిచయం చేసుకుంది. ఇద్దరి మధ్య ఏకాభిప్రాయం కుదరడంతో ఇద్దరూ వీడియో కాల్స్ కూడా చేసుకుని వివాహం చేసుకుందామన్న అభిప్రాయానికి వచ్చారు. కొంతకాలం తర్వాత తనకు యాక్సిడెంట్ అయ్యిందని చెప్పి చికిత్స కోసం డబ్బులు పంపాలని కోరింది. ఆమె అడిగినప్పుడల్లా డబ్బులు పంపుతూ వచ్చాడు. ఇలా రూ. 12 లక్షల వరకు పంపించాడు. పరిచయమై ఏడాది



అవుతోందని, పెళ్లి చేసుకుందామని సదరు యువకుడు ఇటీవల ఒత్తిడి తేవడంతో ఆమె ఇతడి నంబర్ బ్లాక్ చేసింది. దీంతో అనుమానం వచ్చి ఆరా తీయగా.. ఆమెకు వివాహమై భర్త, ఇద్దరు కూతుళ్లు ఉన్నారని తెలిసింది. మోసపోయానని గ్రహించిన సదరు యువకుడు కోర్టు ద్వారా బోధన్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. దర్యాప్తులో విస్తుపోయే విషయాలు తెలిశాయని, సదరు మహిళ తన భర్త, ఇద్దరు కూతుళ్లతో కలిసే యువకుడిని మోసం చేసిందని, తన కూతుళ్లను స్నేహితురాళ్లుగా యువకుడితో మాట్లాడించిందని పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

అన్నా బావూ సాఠే ఆశయ సాధనకు కృషి

జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే



బిచ్కుంద(జుక్కల్): అన్నా బావూ సాఠే ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. ఆదివారం రాజుల్లాలో సాఠే జయంతి ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని అన్నా బావూ సాఠే విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హన్మంత్ సింధే మాట్లాడుతూ.. అన్నా బావూ సాఠే చేసిన సేవలు ప్రజలు ఎన్నటికీ మరిచిపోరని, పేదల గుండెల్లో గూడుకట్టుకొని ఉన్నారని అన్నారు. వెనకబడిన బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్ పటేల్, సర్పంచ్, దళిత నాయకులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ వ్యవస్థను రద్దు చేయాలి



కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో ఔట్ సోర్సింగ్ వ్యవస్థను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు తక్షణమే న్యాయం చేయాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రోటరీ ఆడిటోరియంలో జేఏసీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. తెలంగాణలో అన్ని రంగాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఔట్ సోర్సింగ్ వ్యవస్థను కాంట్రాక్ట్ లేక కార్పొరేషన్ వ్యవస్థలో విలీనం చేసి, పేస్కేల్ అమలు చేయాలని కోరారు. జేఏసీ ప్రతినిధులు అరుణ్, అల్లావుద్దీన్, అనిల్, రాజేందర్, తదితరులున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ చోరీ

బాన్సువాడ రూరల్: మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్ చోరీకి గురైనట్లు విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ రమణారెడ్డి ఆదివారం తెలిపారు. ఈనెల 21న ఆంజనేయులు అనే టెస్టర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించినపుడు ఆయిల్ ఉందని, ఈనెల 25న గోపి అనే ఏఈ చెక్ చేసినప్పుడు ఆయిల్ లేదన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో సుమారు 4వేల లీటర్ల ఆయిల్ చోరీకి గురైందని దాని విలువ సుమారు రూ. 4లక్షల 40వేలు ఉంటుందన్నారు. సంబంధిత అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

దివ్యాంగులకు చేయూత

- నేడు సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో పరికరాల పంపిణీ
- 294 మంది దివ్యాంగులకు లబ్ధి



జిల్లా కేంద్రంలో అలిమ్‌కో ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

ఆర్మూర్: ప్రత్యేక అవసరాలు గల పిల్లల (దివ్యాంగుల)కు వారికి అవసరమయ్యే పరికరాలను అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశేషంగా కృషి చేస్తున్నాయి. తెలంగాణ సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో శిబిరాలు నిర్వహిస్తూ పరికరాలు కొనుగోలు చేసుకోలేని పేద దివ్యాంగులకు వాటిని ఉచితంగా అందజేస్తూ వారి ముఖాల్లో ఆనందాన్ని నింపుతున్నాయి. ఈ ఏడాది శిబిరం నిర్వహించేందుకు డీఈవో దుర్గాప్రసాద్, సహిత విద్యా విభాగం జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్ రావు పర్యవేక్షణలో ఆర్టిఫిషియల్ లింబ్స్ మ్యాని ఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (అలిమ్‌కో) సహకారంతో సోమవారం ఏర్పాట్లు పూర్తి చేశారు. శారీరక, మానసిక వైకల్యం, వినికిడిలోపం, అంధత్వంతో బాధపడుతున్న పిల్లలకు అవసరమైన వీల్ చైర్స్, చంక కర్రలు, ట్రై సైకిళ్లు, రొలేటర్స్, హియరింగ్ ఎయిడ్స్, బ్రెయిలీ కిట్, బ్రెయిలీ ప్లేట్స్, ఎమ్మార్ కిట్‌లతో పాటు కృత్రిమ అవయవాలు అందించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. గతేడాది నవంబర్‌లో జిల్లా కేంద్రంలోని మోడ్రన్ హైస్కూల్‌లో నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సారి శిబిరంలో గుర్తించే 294 మంది లబ్ధిదారులకు ఈ పరికరాలను ఉచితంగా అందజేయనున్నారు. జిల్లా కేంద్రంలోని న్యూ హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ పంపిణీ శిబిరాన్ని నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,057 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో సుమారు 600 మంది చిన్నారులకు వివిధ కేటగిరీల్లో పరికరాలు అవసరం ఉన్నట్లు సహిత విద్యావిభాగం పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ (ఐఈఆర్పీ)లు గుర్తించారు. అలిమ్‌కో అధికారుల పరీక్షల అనంతరం వీరిలో 294 మంది దివ్యాంగులను లబ్ధిదారులుగా గుర్తించారు. శిబిరానికి వచ్చే ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ట్రావెలింగ్ అలవెన్స్ అందించడమే కాకుండా భోజన సదుపాయాన్ని సైతం అధికారులు కల్పించనున్నారు. కార్యక్రమానికి జడ్పీ చైర్మన్ విఠల్‌రావుతో పాటు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

ఎంతో ఉపయోగకరం



దివ్యాంగులు ఈ పరికరాలను తీసుకొని సద్వినియోగం చేసుకోవాలి. వివిధ వైకల్యాలతో బాధపడుతున్న పిల్లలకు ఈ పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయి. శిబిరాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి.

– దుర్గాప్రసాద్, డీఈవో, నిజామాబాద్

గుర్తించిన వారికి ఉచిత పరికరాలు



ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అలిమ్‌కో ప్రతినిధులు అవసరమైన పరికరాల గుర్తింపు పరీక్షలు నిర్వహిస్తారు. గుర్తించిన వారికి పరికరాలను ఉచితంగా అందజేస్తాం. గతంలో పరీక్షల నిర్ధారణ శిబిరానికి హాజరైన దివ్యాంగులు వచ్చి ఈ పరికరాలను తీసుకోవాలి.

– శ్రీనివాస్ రావు, సహిత విద్యావిభాగం జిల్లా కోఆర్డినేటర్, నిజామాబాద్

అ‘పూర్వ’ సమ్మేళనం



సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

బాల్కొండ: ముప్కాల్ మండలంలోని రెంజర్ల గ్రామంలో పదోతరగతి చదివిన 1997–98వ సంవత్సరం విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నగేశ్‌రెడ్డి

- పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేశ్‌రెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని నర్సింగ్‌పల్లిలో కాంగ్రెస్ పాలనలో జరిగిన అభివృద్ధి పనులే కనిపిస్తున్నాయని పీసీసీ ప్రధాన కార్యదర్శి కాట్‌పల్లి నగేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నర్సింగ్‌పల్లిలో మాజీ సర్పంచ్ పెద్ద సాయిలు ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి నగేశ్‌రెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సోనియాగాంధీ ఇచ్చారని గుర్తుచేశారు. మాట తప్పిన చరిత్ర కాంగ్రెస్‌కు లేదని, ఇచ్చిన ప్రతిఒక్క హామీని అమలు చేసిందని, బీఆర్ఎస్ పాలన అంతా అవినీతిమయమని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌పార్టీ అన్నివర్గాల ప్రజలను మోసం చేస్తోందన్నారు. బీఆర్ఎస్‌పై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.2లక్షల రుణమాఫీపైనే మొదటి సంతకమని ప్రకటించిందని, అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే సిలిండర్, వరికి మద్దతు ధర రూ.2500, పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతావత్ యాదగిరి, సిర్పూర్ ఎంపీటీసీ బొడ్డు రఘు, నాయకులు బున్నె రవి, మోహన్‌రెడ్డి, సాయన్న, కిరణ్, మధు, సాయికుమార్ గౌడ్, గంగన్న, రాములు, రవి తదితరులు పాల్గొన్నారు.

మానవతా సదన్ పిల్లలకు చేయూతనందిస్తా

- బోధన్ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా



మానవతాసదన్‌లో పిల్లలతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి అయేషా ఫాతిమా

డిచ్‌పల్లి: మానవతాసదన్ పిల్లల అభివృద్ధికి తన వంతు చేయూతనందిస్తానని బోధన్ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా ఫాతిమా అన్నారు. మండల కేంద్రంలోని మానవతాసదన్‌ను అయేషా ఆదివారం సందర్శించారు. తన జన్మదిన వేడుకలను పిల్లల మధ్య జరుపుకొన్నారు. పిల్లలతో కలిసి కేట్ చేశారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. సదన్ ఆవరణలో మొక్క నాటారు. బీఎస్సీ నర్సింగ్ చదివే అమ్మాయిలకు అయేషా ప్రతి ఏటా చెల్లిస్తున్న రూ.72 వేలు ఫీజుతో పాటు హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ చదువుతున్న పిల్లలకు అయ్యే ఫీజు సైతం అయేషా ఫౌండేషన్ ద్వారా తానే భరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మానవతాసదన్ లైజనింగ్ ఆఫీసర్ సుధాకర్, కేర్‌టేకర్ రమేశ్, సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు అమీర్, సాయికుమార్ గౌడ్, ముబీన్, జుబేర్, ఉమర్‌ఫారుక్, అజీజ్‌ఖాన్, ఇమ్రాన్, టిల్లు, ఫసి, శ్రీకాంత్‌రెడ్డి, సంతోష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



బీబీపేట: గ్రామాలను అభివృద్ధి చేసే దిశగా నూతన జీపీలను మంజూరు చేసి వాటి అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని శేరిబీబీపేట, శివారు రాంరెడ్డిపల్లి గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ భవనాలకు భూమి పూజ చేశారు. ఒక్కో గ్రామ పంచాయతీ భవనానికి సుమారు రూ.20 లక్షల నిధులు కేటాయించి పనులు ప్రారంభించారు. ప్రతి గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం ఉండాలని ప్రభుత్వం నిధులను విడుదల చేసిందని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, దోమకొండ జెడ్పీటీసీ తిరుమల్ గౌడ్, బీబీపేట ఎంపీపీ బాలమణి, దోమకొండ వైస్ ఎంపీపీ బాపురెడ్డి, సర్పంచ్ వర్ల స్రవంతి, ఉప సర్పంచ్ దేవయ్య, ఎంపీటీసీ లక్ష్మి పాల్గొన్నారు.

గల్ఫ్ ఏజెంట్ భారీ మోసం



అన్నారంలో గల్ఫ్ ఏజెంట్ ఇంటి ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన గల్ఫ్ ఏజెంట్ భోజరాం(సన్నీ) భారీ మోసానికి పాల్పడ్డాడు. దుబాయ్‌కి పంపిస్తానని ఆర్మూర్ చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన యువకుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేసి చేతులెత్తేయడంతో బాధితులంతా ఆదివారం అన్నారం గ్రామానికి చేరుకున్నారు. 50 మందికిపైగా యువకులు భోజారాం ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. ఇచ్చిన డబ్బులు తిరిగిచ్చేయాలని డిమాండ్ చేశారు. గల్ఫ్‌కు పంపుతానని ఒక్కొక్కరి వద్ద రూ. 3లక్షల నుంచి రూ. 6లక్షల వరకు వసూలు చేశాడని, తీరా బోర్డు తిప్పేసి మోసం చేశాడని బాధితులు వాపోయారు. సుమారు రూ.4కోట్లతో ఉడాయించాడని, తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆందోళన చేస్తున్న వారిని సముదాయించి పంపించారు.

మాచారెడ్డి ఎంపీపీకి గౌరవ డాక్టరేట్



మాచారెడ్డి(కామారెడ్డి): మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగరావుకు గౌరవ డాక్టరేట్ లభించింది. ఆయన చేసిన రాజకీయ, సామాజిక సేవలకు గాను తమిళనాడులోని ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ యూనివర్సిటీ వారు ఆదివారం గౌరవ డాక్టరేట్ అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు డాక్టరేట్ రావడం గర్వంగా ఉందన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తూ జీవితాన్ని సార్థకం చేసుకుంటానని ఉద్వేగభరితంగా మాట్లాడారు. తన సేవలను గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేసిన తమిళనాడు యూనివర్సిటీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించాలి

- ఎస్సీ, ఎస్టీలను మోసం చేసిన సీఎం కేసీఆర్
- కాంగ్రెస్ జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ కేతావత్ యాదగిరి



సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరి

ఖలీల్‌వాడి: ఎస్సీ, ఎస్టీలను మోసం చేస్తున్న సీఎం కేసీఆర్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్, మాజీ ఎంపీపీ కేతావత్ యాదగిరి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం చేవెళ్లలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ చరిత్రాత్మకమని అన్నారు. సీఎం కేసీఆర్ ఎస్సీ, ఎస్టీలకు అనేక వాగ్దానాలు చేసినా ఇంత వరకు వాటిని అమలు చేయలేదన్నారు. జనాభా ప్రాతిపదికన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎస్సీ రిజర్వేషన్లు 18 శాతం, ఎస్టీలకు 12 శాతం రిజర్వేషన్లు అందిస్తామన్నారు. అంబేద్కర్ అభయ హస్తం కింద రూ.12లక్షల ఆర్థికసాయం, ఇండ్లులేని వారికి ఇంటి స్థలంతో పాటు రూ.6లక్షల నగదు అందజేస్తామని స్పష్టం చేశారు. అసైన్డ్ భూముల పునరుద్ధరణ, పోడుపట్టాల పంపిణీ చేస్తామని ఈ డిక్లరేషన్ ద్వారా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రకటించడం హర్షణీయమన్నారు. దళిత గిరిజనులు కాంగ్రెస్ పార్టీవైపు చూస్తున్నారని వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. విద్యార్థుల కోసం కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చిందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రవినాయక్, సాయికుమార్, చంద్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌కు శ్రీరామరక్ష

- ‘ప్రజా ఆశీర్వాద యాత్ర’లో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



ప్రజా ఆశీర్వాద యాత్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

డొంకేశ్వర్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే బీఆర్ఎస్ పార్టీకి శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. నమస్తే నవనాథపురం కార్యక్రమంలో భాగంగా డొంకేశ్వర్ మండలం గంగసరంలో ‘ప్రజా ఆశీర్వాద యాత్ర’ను ఆదివారం నిర్వహించారు. దత్తాపూర్, మారంపల్లి గ్రామాల మీదుగా నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే స్వయంగా బుల్లెట్ వాహనం నడిపారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. గ్రామంలో పూర్తయిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం సభలో మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ముసుగేసుకుని వస్తున్న స్మగ్లర్లు, మోసాగాళ్లకు ప్రజలే తగ్గిన బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం గ్రామానికి మంజూరు చేసిన నిధులు, అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ ఫలాలు పేదలకు అందిస్తున్నది కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, మరోసారి కారు గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మగ్గిడి లక్ష్మీప్రవీణ్‌రెడ్డి, మారంపల్లి ఎంపీటీసీ రాజగంగు, ఎంపీపీ వాకిడి సంతోష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మచ్చర్ల సాగర్, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల బైక్ ర్యాలీ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): లింగంపేటలో ఆదివారం నిర్వహించిన ప్రవాస్ యోజన ముగింపు సభలో పాల్గొనేందుకు నాగిరెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ శ్రేణులు బైక్ ర్యాలీగా బయల్దేరి వెళ్లారు. బీజేపీ మండలాధ్యక్షుడు హన్మాండ్లుతోపాటు బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఇందూరులో సినీనటి ఫరియా సందడి



జ్యోతి వెలిగించి సెలూన్‌ను ప్రారంభిస్తున్న నటి

నిజామాబాద్ సిటీ: జాతి రత్నాలు ఫేమ్ సినీనటి ఫరియా అబ్దుల్లా నగరంలో సందడి చేశారు. నగరంలోని ఆర్మూర్‌రోడ్డులో మెనియా సెలూన్‌ను సినీనటి ఆదివారం ప్రారంభించారు. సినీనటిని చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో వచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత పోచారం సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్ మీసాల సవితాశ్రీనివాస్, మోస్రా జడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, సెలూన్ యజమాని సోమ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఇసుక స్మగ్లింగ్‌కు చెక్!

- అక్రమ రవాణాపై మైనింగ్ అధికారుల దృష్టి
- ఇసుక తరలిస్తున్న వాహనాల సీజ్



ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్న దృశ్యం

మోర్తాడ్(బాల్కొండ): ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వ్యాపారులపై స్థానిక అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడతో భూగర్భ ఖనిజాల శాఖ(మైనింగ్) సీరియస్‌గా పరిగణిస్తోంది. ఇసుక స్మగ్లింగ్‌కు చెక్ పెట్టడానికి మైనింగ్ శాఖ ఉద్యోగులు ఆకస్మిక దాడులకు పాల్పడుతూ వాహనాలను సీజ్ చేస్తున్నారు. రెండు రోజుల క్రితం దొన్కల్ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుకను ట్రాక్టర్లను సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అలాగే పదిహేను రోజుల కింద ఒక టిప్పర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా దానిని సీజ్ చేశారు. మైనింగ్ శాఖ నిబంధనల ప్రకారం జరిమానా వసూలు చేసి వాహనాలను విడిచిపెట్టడానికి రిలీజ్ ఆర్డర్ ఇవ్వడానికి అవకాశం ఉంది. మోర్తాడ్‌లోని పెద్దవాగు, మొండివాగుల నుంచి కొన్ని రోజులుగా పగలు, రాత్రి అని తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా సాగుతూనే ఉంది. ఇసుక వ్యాపారులు ఎలాంటి అనుమతులు తీసుకోకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. రాజకీయ ఒత్తిళ్లు, పలు కారణాలతో ఇక్కడి అధికారులు ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో మైనింగ్ శాఖ అధికారులు స్వయంగా రంగంలోకి దిగి అక్రమ రవాణాకు చెక్ పెడుతున్నారు. ఇదిలా ఉండగా రామన్నపేట్, సుంకెట్, జాగిర్యాల్ ప్రాంతా ల నుంచి పగటిపూట డంప్ చేసిన ఇసుకను పెద్ద వాహనాల్లో నింపి నిజామాబాద్, నిర్మల్, హైదరాబాద్ ప్రాంతాలకు తరలిస్తున్నారు. మైనింగ్ శాఖ అధికారులు ఈ వాహనాలపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి



మృతి చెందిన ప్రేమ్‌సింగ్



టి శ్రీనివాస్ (ఫైల్)



ఎ శ్రీనివాస్ (ఫైల్)

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మల్లుపేట్ శివారులోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గురుకుల కళాశాలకు చెందిన ఇంటర్ విద్యార్థి మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై రాజు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రాజంపేట్ మండలంలోని కొండాపూర్‌కు చెందిన కేతావత్ ప్రేమ్‌సింగ్(22), మిత్రుడు సందీప్ ద్విచక్ర వాహనంపై గాంధారి నుంచి కామారెడ్డికి వెళ్తుండగా ముందున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి కింద పడిపోయారు. ఈ ఘటనలో ప్రేమ్‌సింగ్ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సందీప్‌కు గాయాలయ్యాయి. వీరు గాంధారి మండల కేంద్రంలోని ఎస్టీ గురుకుల కళాశాలలో ఇంటర్ సెకండీయర్ చదువుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యాన్ ఢీకొని యువకుడు..

రుద్రూర్: మండలంలోని ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు ఏఎస్సై రాజు ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. వర్ని మండలం జాకోరా గ్రామానికి చెందిన తోకల శ్రీనివాస్ (29) ఆటో నడుపుకొంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. జాకోరా నుంచి శనివారం రాత్రి కిరాయి నిమిత్తం ఒంటి గంట ప్రాంతంలో బోధన్ పట్టణానికి వెళ్తుండగా రుద్రూర్ మండల శివారులో ఎదురుగా వస్తున్న ఐచర్ వ్యాన్ ఆటోను ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య గంగాజమున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

డివైడర్ ఢీకొని ఒకరు..

డిచ్‌పల్లి: బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నడిపల్లి గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. నగరంలోని సీతారాం నగర్ కాలనీకి చెందిన అనంతోజు శ్రీనివాస్(43), స్నేహితుడు సురేశ్‌తో కలిసి డిచ్‌పల్లికి వెళ్లి వస్తుండగా స్కోడా షోరూం ఎదుట బైకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందగా సురేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. మృతుడి తమ్ముడు అనంతోజు ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జాతీయ రహదారిపై తెగిపడిన విద్యుత్ వైర్



తెగిపడిన విద్యుత్ వైర్ చుట్టుకుని రహదారిపై పడిపోయిన బైక్

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలంలో భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం ఆదివారం కురవడంతో జాతీయ రహదారిపై విద్యుత్‌వైర్ తెగిపడింది. అదే సమయంలో రోడ్డుపై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహన టైర్‌కు విద్యుత్ వైర్ చుట్టుకుంది. ఈ ఘటనలో యువకుడికి గాయాలయ్యాయి. విద్యుత్‌సరఫరా లేకపోవడంతో ప్రాణనష్టం జరుగలేదు. ఈ దృశ్యాన్ని దూరం నుంచి గమనించిన ఓ లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వస్తున్న కంటెయినర్ లారీని ఢీకొన్నది. ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో భారీ ప్రమాదం తప్పింది.



ముందు వెళ్తున్న ట్రక్కును ఢీకొన్న కంటెయినర్